క్లుప్తంగా

నందిగామ తహసీల్దార్‌గా లక్ష్మయ్య



నందిగామ: నందిగామ నూతన తహసీల్దార్‌గా లక్ష్మయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన విజయ్‌కుమార్ షాద్‌నగర్ ఆర్డీఓ కార్యాలయానికి బదిలీపై వెళ్లగా చౌదరిగూడ మండలంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ లక్ష్మయ్య పదోన్నతిపై నందిగామ మండలానికి వచ్చారు.

వాల్‌పోస్టర్లు తొలగించాలి

తహసీల్దార్ రమేశ్‌కుమార్



ఎన్నికల విధివిధానాలు వివరిస్తున్న తహసీల్దార్ రమేశ్ కుమార్

కొందుర్గు: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో రాజకీయ పార్టీల పోస్టర్లను తొలగించాలని తహసీల్దార్ రమేశ్ కుమార్ తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రభుత్వ భవనాలు, పాఠశాల భవనాలు, విద్యుత్ స్తంభాలపై పోస్టర్లను వెంటనే తొలగించాలన్నారు. రాజకీయ పార్టీల జెండా గద్దెలు, విగ్రహాలను మూసి ఉంచాలని సూచించారు. 12గంటల్లో పోస్టర్లు విధిగా తొలగించాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ అంజనేయులు, ఎంపీఓ లాలయ్య పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినులకు గోల్డ్ మెడల్స్



పతకాలు సాధించిన విద్యార్థినులతో అధ్యాపక బృందం

షాద్‌నగర్: 2వ ఇంటర్నేషనల్ తెలంగాణ కప్ ఛాంపియన్ కరాటే పోటీల్లో నాగర్‌కర్నూల్ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు సత్తాచాటారు. ఆదివారం నగరంలోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన అండర్ 18 కథాస్, స్పైరింగ్ విభాగంలో మమత, విజయలక్ష్మి, స్వప్న, జ్యోతి, ఇందు బంగారు పతకాలు సాధించారు. కథాస్ విభాగంలో ప్రియాంక, గీత, ఐశ్వర్య, అంకిత, శిరేఖ, బంగారు పతకాలు సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, వైస్ ప్రిన్సిపాల్ కోమల్, స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య అభినందించారు.

కాలినడకన శబరిమలకు..

అజీజ్‌నగర్ నుంచి ప్రారంభమైన యాత్ర



ఇరుముడి కట్టుకున్న అయ్యప్ప మాలధారులు

మొయినాబాద్/మొయినాబాద్‌రూరల్: అయ్యప్ప మాలధారణ స్వాములు శబరిమలకు అజీజ్‌నగర్ నుంచి సోమవారం పాదయాత్రగా బయలుదేరారు. గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ఉపసర్పంచ్, గురుస్వామి అల్లం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో 120 మంది స్వాములు ఇరుముడికి కట్టుకున్నారు. ఈ పూజలో వార్డు సభ్యుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్తపల్లి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు. పాదయాత్రలో బయలుదేరుతున్న స్వాములు కుమ్మరి కష్ణ, సురేందర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, సహదేవ్, వెంకట్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, అయ్యప్ప భక్తుడు అల్లం సుధాకర్‌రెడ్డి తదితరులున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సీఐ యాదయ్యగౌడ్

షాబాద్: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని షాబాద్ సీఐ యాదయ్యగౌడ్, ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని షాబాద్–షాద్‌నగర్ లింక్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో మాంటిస్సోరీ పాఠశాల కరస్పాండెంట్ మహేశ్‌యాదవ్, ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు సమన్వయ సమితి సభ్యుడిగా శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యుడిగా బాచిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి అధికారికంగా వచ్చిన నియామక పత్రాన్ని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శ్రీనివాస్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్ ఉన్నారు.

ఎన్నికలకు సంసిద్ధం

- అమల్లోకి ఎలక్షన్ కోడ్
- నియోజకవర్గంలో 298 పోలింగ్ బూత్‌లు, 2,53,972 మంది ఓటర్లు
- చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం



చేవెళ్ల: కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇవ్వడంతో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. చేవెళ్ల ఆర్డీఓ కార్యాలయంలో ఆయన ఆర్డీఓ సాయిరాం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ వచ్చిన నేపథ్యంలో ప్రతీ ఒక్కరు ఎన్నికల నియమావళి పాటించాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలు అధికారులు అధికారులకు సహకరించాలని కోరారు. నియోజకవర్గంలో ఐదు మండలాల్లో మొత్తం 298 పోలింగ్‌బూత్‌లు ఉన్నాయని తెలిపారు. ఈనెల 4 వరకు సిద్ధమైన తుది నియోజకవర్గ ఓటర్ల జాబితా ప్రకారం.. 298 పోలింగ్ బూత్‌లకుగాను 2,53,972 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. ఇందులో పురుషులు 1,28,773 కాగా మహిళలు 1,25,195 మంది, ఇతరులు నలుగురు ఉన్నట్లు చెప్పారు. ఓటరు నమోదు ప్రక్రియ నిరంతర ప్రక్రియ అని అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. ఎన్నికల నియామావళి ప్రకారం చివరి జాబితా వరకు మార్పులు చేర్పులు, చేరికలకు అవకాశం ఉంటుందని గుర్తించాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితాపై ప్రతేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. పారదర్శకంగా ఓటరు జాబితాను సిద్ధం చేస్తున్నామన్నారు.

పెరిగిన ఓటర్లు

2023 ఆగస్టు వరకు నియోజకవర్గంలో 2,44,158 మంది ఓటర్లు ఉంటే ఇప్పుడు 9,814 మంది ఓటర్లు పెరిగి 2,53,972 మంది అయినట్లు చెప్పారు. ఓటరు నమోదుకు సంబంధించి 11,121 మందిని నియోజకవర్గంలో చేర్చామని.. 2,846 మంది పలు కారాణలతో తొలగించామని వివరించారు. దరఖాస్తులు 2016 రాగా ఇందులో 1,639 కొత్తగా నమోదుకోసం, 46 ఓటరు తొలగింపుకోసం, 331 దరఖాస్తులు మార్పులు, చేర్పుల కోసం వచ్చాయన్నారు. కొత్తగా సిద్ధమైన ఓటరు జాబితా ప్రకారం నియోజకవర్గంలో 80ఏళ్లకు పైబడిన వారు 4,128 మంది, దివ్యాంగులు 176 మంది, 18–19 ఏళ్ల యువకులు 6,411 మంది, 75 మంది సరీస్ ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల నియామావళి ప్రకారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు, అధికారులతో సమావేశాలు నిర్వహించి అన్ని పోలింగ్ బూత్‌ల పరిశీలన సౌకర్యాల వివరాలు సేకరించినట్లు చెప్పారు. ఎన్నికల కోడ్ వచ్చేసిందని ఇక ఎన్నికల పక్రియ ప్రారంభమైనట్లేనన్నారు. దీనిపై డివిజన్‌లోని అధికారులను సిద్ధం చేస్తున్నామన్నారు.

నియోజకవర్గ ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
నవాబుపేట	18,192	17,686	0	35,878
శంకర్‌పల్లి	31,065	30,987	0	62,052
మొయినాబాద్	28,520	27,124	1	55,645
షాబాద్	22,915	22,113	1	45,029
చేవెళ్ల	28,081	27,285	2	55,368
మొత్తం	1,28,773	1,25,195	4	2,53,972

బీజేపీతోనే ప్రజాసంక్షేమం

- పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి
- కమలం గూటికి చేరిన గుండ్యానాయక్ తండా వాసులు

షాద్‌నగర్: ప్రజాసంక్షేమం కోసమే బీజేపీ కృషి చేస్తోందని పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండలం గుండ్యా నాయక్ తండాకు చెందిన సుమారు 50 మంది యువకులు పార్టీ మండల అధ్యక్షుడు దొడల వెంకటేశ్ ఆధ్వర్యంలో కమంలం గూటికి చేరారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి వారికి కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పాలనలో పేదలకు ఒరిగిందేమీ లేదన్నారు. పార్టీలో చేరిన వారిలో సందీప్, మాన్‌సింగ్, రాములు నాయక్, బాబు నాయక్, దేవేందర్, రవి నాయక్, మంగ్యా, తోత్యానాయక్, మోహన్‌నాయక్, కృష్ణ నాయక్, రాకేష్, సురేష్, రతన్‌సింగ్, సాయికుమార్, మోహన్, కిషన్, సాయికుమార్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్ సింగ్, వెంకట్‌రెడ్డి, సురేశ్, భీమయ్య, అజయ్, ఆంజనేయులు, ప్రవీణ్, శివ, శ్రీకాంత్, రవి తదితరులు పాల్గొన్నారు.



బీజేపీలో చేరిన గిరిజనులు

సొంతింటి కలను నిజం చేసిన సీఎం



లబ్ధిదారులతో ఎంపీపీ, సర్పంచ్‌లు

శంకర్‌పల్లి: పేదలకు సొంతింటి కలను నెరవేర్చిన సీఎంగా కేసీఆర్ చరిత్రకెక్కరని శంకర్‌పల్లి ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని మిర్జాగూడ అనుబంధ గ్రామమైన ఇంద్రారెడ్డి నగర్‌లో నిర్మించిన 20 డబుల్‌బెడ్రూం ఇళ్ల పట్టాలను మిర్జాగూడ, జనవాడ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. దేశంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయన్నారు. 60ఏళ్ల పాలనలో జరగని అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వం హయాంలో జరుగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గోవిందమ్మ, సర్పంచ్‌లు రవీందర్‌గౌడ్, లలిత, శంకర్‌పల్లి మర్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కురుమ వెంకటేశ్, ఎంపీటీసీ సభ్యుడు నాగేందర్, ఆర్ఐ తేజ, కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్, కో ఆప్షన్ సభ్యుడు కిషన్‌సింగ్, వార్డు సభ్యులు ప్రవీణ్, చిట్టమ్మ, శారద, రాజుగౌడ్, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

చేవెళ్ల: మండల పరిధిలోని మల్కాపూర్‌లో దళిత దివ్యాంగుడు పింఛన్ విషయంపై మంత్రి, ఎంపీలకు ఫిర్యాదు చేసేందుకు వస్తే ఆయనపై దాడి చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు శంకర్‌రావుమాదిగ, ప్రవీణ్‌కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. మల్కాపూర్‌లో సర్పంచ్ శేరి శివారెడ్డి అనుచరులు ఈ దాడికి పాల్పడ్డారని దీనిపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం బాధితుడు రవి మాట్లాడుతూ.. తనపై కక్షపూరితంగానే సర్పంచ్ శేరి శివారెడ్డి సోదరులు, అతని అనుచరులు దాడి చేశారని బాధి రవి తెలిపారు. తనపై తన సోదరులపై దాడికి పాల్పడిన ఆరుగురిపై పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు.

నేడు మహనీయుల విగ్రహావిష్కరణ

చేవెళ్ల: మండల పరిధిలోని రేగడిఘనాపూర్‌లో మంగళవారం అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేగరి రాజు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన సంఘం నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తులు స్వచ్ఛందంగా మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి సుబ్రహ్మణ్యం, సభ్యులున్నారు.

హాజరవ్వనున్న మంత్రులు

గ్రామంలో మహనీయుల విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మంత్రులు సబితారెడ్డి, పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య హాజరవుతారని పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్ సోమవారం వెల్లడించారు. ఉదయం 10గంటలకు నిర్వహించే కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థుల చేతిలోనే దేశ భవిష్యత్

తహసీల్దార్ పార్థసారధి

షాద్‌నగర్: విద్యార్థులు సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం అవ్వాలని తహసీల్దార్ పార్థసారధి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్.రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా కార్యాలయం ఆవరణలో చెత్త, పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ.. చిన్ననాటి నుండే విద్యార్థులు సమాజంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య విషయాలపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు పాటుపడాలన్నారు. దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



శ్రమదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

షాబాద్: క్రీడాకారులకు తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తిర్మలాపూర్ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం గ్రామంలో ప్రభుత్వం పంపిణీ చేసిన స్పోర్ట్స్ మెటీరియల్ యువతకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు.



స్పోర్ట్స్ మెటీరియల్ పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి

బీఆర్ఎస్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభం

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు: రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. రెండు నెలల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఆమనగల్లులో విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి, నియంత పాలనను సాగిస్తోందని ఆరోపించారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ ఒక్క హామీని అమలు చేయలేదని మండిపడ్డారు.

నేడు కల్వకుర్తిలో సమావేశం

ఆమనగల్లు మండలం రాంనుంతల గేటు వద్ద ఉన్న డీఎంకే ఫంక్షన్ హాలులో మంగళవారం కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సమావేశానికి ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీ చంద్‌రెడ్డి, మల్లురవి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

సర్పంచ్ శోభారెడ్డి

మొయినాబాద్ రూరల్: అభివృద్ధి, సంక్షేమం సీఎం కేసీఆర్‌కు రెండు కళ్లు అని కేతిరెడ్డిపల్లి సర్పంచ్ శోభా వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆమె గ్రామంలో రూ.30లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు పట్టణాలను తలపిస్తున్నాయన్నారు. గ్రామంలో నెల రోజులుగా రూ.1.35కోట్లతో సీసీ రోడ్డు పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్ సిద్దయ్య, మహిళా సంఘాల సభ్యులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

పాఠశాలకు కంప్యూటర్ల వితరణ



సురంగల్ పాఠశాలకు కంప్యూటర్లు అందజేస్తున్న సీతారాంరెడ్డి

మొయినాబాద్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఓ యువకుడు చేయూతనందించాడు. మండల పరిధిలోని సురంగల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన యువకుడు గుమ్మళ్ల సీతారాం రెడ్డి సోమవారం రెండు కంప్యూటర్లు, స్కానర్, ప్రింటర్, సీలింగ్ ఫ్యాన్లు, సౌండ్ సిస్టం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో వసతులు కల్పించేందుకు తనవంతు సహకారం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ యాదమ్మ, వార్డు సభ్యులు విక్రం రెడ్డి, షఫీ, ప్రధానోపాధ్యాయుడు జహీర్, యువకులు అశోక్‌గౌడ్, విజయ్‌గౌడ్, ప్రభుయాదవ్, గౌతంరెడ్డి, శేఖర్‌చారి, యాదయ్య, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీపీలు నిధులు సమకూర్చుకోవాలి

జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత

కొత్తూరు: గ్రామ పంచాయతీలు స్వచ్ఛందంగా ఆదాయ వనరులను సమకూర్చుకునేందుకు కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు ఎమ్మె శ్రీలత సూచించారు. సోమవారం ఆమె మండల పరిధిలోని కొడిచర్లతండాలో సర్పంచ్ సంతోష్ నాయక్‌తో కలిసి గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పంచాయతీలకు పథకాల రూపేణ వచ్చే నిధులతో పాటు ఇంటి, వ్యాపార సముదాయాలు, పరిశ్రమల నుంచి పన్నుల రూపంలో నిధులను సేకరించాలని సూచించారు. పంచాయతీల అభివృద్ధికి సకాలంలో పన్నులు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రవీందర్‌రెడ్డి, నాయకులు జంగయ్య, బాలరాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న శ్రీలత

గొర్రెల పంపిణీ ఎప్పుడు?

ఆమనగల్లు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ఆమనగల్లు మండలంలో వెంటనే చేపట్టాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆమనగల్లు పట్టణంలోని పశువైద్యశాల ఎదుట గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పథకం కోసం డీడీలు కట్టినా ప్రభుత్వం పంపిణీ చేపట్టడం లేదని, ఎప్పుడు పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. అనంతరం పశువైద్య కేంద్రంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీశైలంయాదవ్, పెంటయ్య, శ్రీను, రాములుయాదవ్, కృష్ణయ్య, వెంకటయ్య, నర్సింహ, శ్రీకాంత్, వెంకటేశ్, శివశంకర్, పవన్, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

‘దళితబంధు’ ఎంపికలో అవకతవకలు

కడ్తాల్: దళితబంధు లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు చోటు చేసుకున్నాయని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు పార్టీ ఆధ్వర్యంలో సోమవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నేతలు మాట్లాడుతూ.. దళిత బంధు అర్హులకు కాకుండా బీఆర్ఎస్ నాయకులే ఇవ్వడంతో అర్హులకు అన్యాయం జరుగుతుందని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులనే ఎంపిక చేస్తున్నారని, అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరు మారకుంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీఓ, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, ఎస్సీసెల్ తాలుకా అధ్యక్షుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ కానుక.. ఆత్మగౌరవ ప్రతీక

షాద్‌నగర్: బతుకమ్మ కానుక.. ఆత్మగౌరవ ప్రతీకయని విశ్వాల సర్పంచ్ జయశ్రీ అన్నారు. సోమవారం గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో ప్రభుత్వం అందజేస్తున్న బతుకమ్మ చీరలను సర్పంచ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పండుగ పూట కొత్త బట్టలు ధరించాలనే ఉద్దేశంతో ప్రతీ ఏడు బతుకమ్మ కానుక అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్, ఉప సర్పంచ్ జంఖపుర్యా నాయక్, వీఓఏ మెయినుద్దీన్, అంగన్‌వాడీ కార్యకర్తలు సర్వమ్మ, సుమలత, శంకరమ్మ, వార్డు సభ్యులు వెంకటయ్య, మేఘ్యా, చిట్టెమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్: చీరలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ జయశ్రీ

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

షాబాద్: ప్రజల సంక్షేమ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్దార్‌నగర్ సర్పంచ్ స్వరూప అన్నారు. సోమవారం మండల పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామంలో మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు వనిత, ఉపసర్పంచ్ ఇందిర, పంచాయతీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింహులు, వార్డు సభ్యులు విజయలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు రాంమ్మోహన్‌గుప్తా, హరీశ్, శశాంక్‌రెడ్డి, రఘు, చంద్రశేఖర్, రమేశ్, సందీప్, అశోక్, సాయి, భద్రి, బబ్లూ, శ్రీను, అంగన్‌వాడీ కార్యకర్తలు కమల, చంద్రకళ తదితరులున్నారు.



షాబాద్: సర్దార్‌నగర్‌లో సర్పంచ్, ఎంపీటీసీ తదితరులు

అభివృద్ధిలో దేశానికే ఆదర్శం

మొయినాబాద్‌రూరల్: అభివృద్ధిలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా అభివృద్ధి సాధిస్తోందని హిమాయత్‌నగర్ సర్పంచ్ మంజుల అన్నారు. సోమవారం ఆమె పంచాయతీ కార్యాలయంలో మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు కవిత, పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మొయినాబాద్ రూరల్: హిమాయత్‌నగర్‌లో సర్పంచ్ మంజుల